జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/







# నేటినుంచి టిడిపి మహానాడు

## వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ

## పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్ ప్రకటించనున్న చంద్రబాబు**

- రెండు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడు
- ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్, ఫిజికల్ పద్ధతిలో నిర్వహణ
- ‘స్త్రీ శక్తి’ ప్రధాన ఇతివృత్తంగా తీర్మానాలు, చర్చలు
- 2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్, కార్యకర్తలకు దిశానిర్దేశం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌కు ఇదే తొలి మహానాడు



తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పండుగలాంటి మహానాడుకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఓ సంప్రదాయంగా, చారిత్రక అవసరంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్, 2026 సంవత్సరానికి సరికొత్త రీతిలో, నూతన ఉత్తేజంతో జరగనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు అమరావతి కేంద్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ‘స్త్రీ శక్తి’ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఈ మహానాడును తీర్చిదిద్దారు. 44 ఏళ్ల పార్టీ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను నెమరువేసుకుంటూ, వర్తమాన రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకుని, 2029 ఎన్నికల లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణకు



## పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన

# రేవంత్ సర్కారు

- రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు
- జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం
- పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ
- అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత



రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి

## కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

- డికెకు పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధం
- సిద్దరామయ్యను రాజ్యసభకు పంపే యత్నం?



# తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత...

- రేవంత్ సర్కారుపై ఫిర్యాదు
- భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
- ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్

# హైదరాబాద్‌కు వచ్చేసిన బెంగళూరు ఫేమస్ ‘ఊట’..

- తెలుగు రుచులకు కొత్త అడ్డా
- హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రారంభమైన ‘ఊట’ రెస్టారెంట్
- బెంగళూరులో ప్రసిద్ధి చెందిన బ్రాండ్ ఇది
- తెలంగాణ, ఆంధ్రా, నిజామీ వంటకాలే ఇక్కడ ప్రత్యేకం
- పూతరేకులు, బందరు హల్వా వంటి సంప్రదాయ రుచులు
- టోటల్ ఎన్విరాన్‌మెంట్ హాస్పిటాలిటీ ఆధ్వర్యంలో నిర్వహణ




బెంగళూరులో ప్రాంతీయ వంటకాలకు పేరుగాంచిన ‘ఊట’ రెస్టారెంట్ ఇప్పుడు హైదరాబాద్ నగర వాసులకు అందుబాటులోకి వచ్చింది. నగరంలోని హైటెక్ సిటీ (మాదాపూర్)లో



# నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు: ప్రొఫెసర్ నాగేశ్వర్

- తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్
- నోటీసులు వచ్చినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై క్లారిటీ
- వివాదాస్పద వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు వెల్లడి



# ఇరాన్‌పై అమెరికా నిప్పుల వర్షం

- క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మందుపాతరలు అమర్చే పడవలు ధ్వంసం
- కేవలం ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామన్న అమెరికా
- అమెరికా దుశ్చర్యను తీవ్రంగా ఖండించిన ఇరాన్

వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణతో కొన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్న పశ్చిమాసియాలో మళ్లీ ఒక్కసారిగా అలజడి చెలరేగింది.

Telangana

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## డిక్లరేషన్ పేరుతో దగా

కవాడిగూడ, మే 26: చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీలను దగా చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు మండిపడ్డారు. లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ముడావత్ రాంబాల్‌నాయక్ అధ్యక్షతన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద నంగారాభేరి పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 3,146 తండాలను గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఇందిరాపార్కు వద్ద జరుగుతుంది ధర్నా కాదని లంబాడాల ఆత్మగౌరవ పోరాటం అని అన్నారు. ఎన్నికల ముందు చేతులు జోడించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పామై కాటేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసుకు సంబంధించి మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కోసం భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు మూడు రోజులకు మాత్రమే అనుమతించింది. దీంతో ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంతకుముందు, పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని, విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మే 8న భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు కేసులో కఠినమైన సెక్షన్లను జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. నేరం అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

న్యూఢిల్లీ: కర్ణాటకలో నాయకత్వ పోరుకు తెరపడనున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. సిఎం మార్పు లేదని బయటకు చెబుతున్నా, డికె శివకుమార్‌కు పగ్గాలు అందించేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మరోసారి నాయకత్వ సమస్య తెరపైకి వచ్చింది. పార్టీ అధిష్టానం సిద్ధరామయ్య, డీకేలను న్యూఢిల్లీకి పిలవడంతో ఎట్టకేలకు సమస్య కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అధిష్టానం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి కేంద్రంలో కీలక పాత్ర పోషించాల్సిందిగా కోరిందని తెలుస్తోంది. తగిన సమయం తీసుకుని నిర్ణయం చెప్పాల్సిందిగా ఆయనకు సూచించినట్టు చెబుతున్నారు. దీంతో సిద్ధరామయ్య రెండు, మూడు రోజుల్లో రాజీనామా చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే ఢిల్లీ సమావేశంలో చర్చించినట్టు కాంగ్రెస్ అధిష్టానం చెబుతున్నప్పటికీ ఈ సమావేశంలో రాష్ట్రంలో నాయకత్వ మార్పిడిపై ప్రధానంగా చర్చ జరిగినట్టు చెబుతున్నారు. డీకే శివకుమార్‌కు అధికారాన్ని (సీఎం) బదిలీ చేసేందుకు అధిష్టానం ఏకగ్రీవంగా మద్దతు పలికిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్‌కు వచ్చేసిన బెంగళూరు ఫేమస్ 'ఊట'..

తమ కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. అచ్చమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, నైజాం వంటకాలను అందించడమే ఈ రెస్టారెంట్ ప్రత్యేకత. టోటల్ ఎన్విరాన్‌మెంట్ హాస్పిటాలిటీ ఈ రెస్టారెంట్‌ను నిర్వహిస్తోంది. ఇక్కడి మెనూలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధ వంటకాలకు పెద్దపీట వేశారు. స్టార్టర్స్‌లో శికంపూరి కబాబ్స్, నెల్లూరు చేపల వేపుడు, బాపట్ల కోడి వేపుడు వంటివి అందిస్తుండగా, ప్రధాన వంటకాల్లో హలీమ్-ఎ-ఖాస్, ముద్దపప్పుతో పచ్చి పులుసు, నాటు కోడి పులుసు, పీతల ఇగురు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటితో పాటు డెజర్ట్స్‌లో ఆత్రేయపురం పూతరేకులు, మచిలీపట్నం బందరు హల్వా వంటి సంప్రదాయ రుచులను కూడా అందిస్తున్నారు. అంతేకాకుండా, గుంటూరు ఓల్డ్ ఫ్యాషన్డ్, గోంగూర హైబాల్ వంటి వినూత్న కాక్‌టెయిల్స్ కూడా మెనూలో ఉన్నాయి. కర్ణాటకలో విజయం సాధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆహార సంస్కృతులను పరిచయం చేయాలనుకోవడం సహజమైన ముందడుగు అని టోటల్ ఎన్విరాన్‌మెంట్ వ్యవస్థాపకుడు కమల్ సాగర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా, ఫుడ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ రెస్టారెంట్ గురించి మంచి చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో సంప్రదాయ తెలుగు, నైజాం వంటకాలను ఆధునిక వాతావరణంలో ఆస్వాదించాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపికగా నిలుస్తోంది.

## పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా నిప్పుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్‌తో శాంతి ఒప్పందం విషయంలో ముందడుగు వేశామని ఒకవైపు అమెరికా అధ్యక్షుడు చెబుతుండగా, మరోవైపు అమెరికా సైన్యం సోమవారం దక్షిణ ఇరాన్‌పై భీకర దాడులకు పాల్పడింది. బందర్ అబ్బాస్ సహా పలు ప్రాంతాల్లో ఇరాన్ సైనిక స్థావరాలపై నిప్పులు వర్షం కురిపించింది. ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సముద్రంలో మందుపాతరలు అమర్చే పడవలను ధ్వంసం చేసినట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ సోమవారం ప్రకటించారు. ఇవి కేవలం తమ ఆత్మరక్షణ కోసం జరిగిన దాడులేనని వివరణ ఇచ్చారు. ఇరాన్ దళాల ముప్పు నుంచి తమ సైనికులను కాపాడుకోవడానికి దాడులకు చేయక తప్పలేదన్నారు. అయితే, ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది కాబట్టి తాము చాలా సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. అమెరికా దాడుల్లో ఇరాన్‌కు ఏ మేరకు నష్టం వాటిల్లిందన్నది ఇంకా తెలియరాలేదు. పడవలపై అమెరికా దాడులు చేయడంతో నలుగురు ఇరాన్ జవాన్లు మరణించినట్లు 'తబ్నాక్'అనే వార్తా సంస్థ వెల్లడించింది. హోర్ముజ్ జలసంధిపై ఉన్న, సైనిక ఓడరేవుతోపాటు విమానాశ్రయం కలిగిన బందర్ అబ్బాస్ నగర పరిసరాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. తాజా దాడులు కాల్పుల విరమణ ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 7 నుంచి కాల్పుల విరమణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

**శాంతి యత్నాలకు భంగం కలిగించొద్దు: ఇరాన్**

అమెరికా దాడులను ఇరాన్ మంగళవారం తీవ్రంగా ఖండించింది. ఈ పరిణామాన్ని దురుద్దేశం, విశ్వసనీయత లేమికి సంకేతంగా అభివర్ణించింది. శాంతి యత్నాలకు భంగం కలిగించే చర్యలకు పూనుకోవద్దని సూచించింది. కాల్పుల విరమణను అమెరికా ఉల్లంఘినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. తదుపరి అన్ని పరిణామాలకు అమెరికా బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఏ దురాక్రమణ చర్యకైనా జవాబు ఇవ్వకుండా ఇరాన్ వదిలిపెట్టదని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో శాంతి సాధన కోసం ఖతార్‌లో చర్చల కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ ఘలిబాఫ్ ఈ చర్చల్లో పాల్గొంటున్నారు. చర్చలు సజావుగా సాగుతున్నాయని, ఒప్పందం విషయంలో తాము తొందరపడడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం స్పష్టంచేశారు.

**అమెరికా డ్రోన్లు, ఫైటర్ జెట్‌ను కూల్చాం: ఐఆర్‌జీసీ**

అమెరికాకు బుద్ధి చెప్పామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) ప్రకటించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా డ్రోన్లను, ఒక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తెలిపింది. అయితే, ఈ ఘటన ఎప్పుడు జరిగిందన్నది బయటపెట్టలేదు.

**ఆ యురేనియంను నాశనం చేయాల్సిందే: ట్రంప్**

ఇరాన్ వద్దనున్న శుద్ధిచేసిన యురేనియం(అణు ధూళి)ను నాశనం చేయాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాకు తరలించి, నాశనం చేయవచ్చని చెప్పారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆధ్వర్యంలో మరొక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో నాశనం చేయడానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆ యురేనియంను అక్కడికక్కడే నామరూపాల్లేకుండా చేసినా అభ్యంతరం లేదన్నారు. ఇరాన్ వద్దనున్న యురేనియంను తమకు అప్పగించాలని, అలాగైతేనే ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అంగీకరిస్తామని ట్రంప్ ఇప్పటిదాకా షరతు విధించిన విషయం విదితమే. కానీ, తాజాగా ఆయన తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తాజాగా సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

## తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత...

అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

## నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు: ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఏపీ ప్రభుత్వం అప్పుడే ఖండించింది. తాజాగా ప్రొఫెసర్ నాగేశ్వర్ స్వయంగా తనకు నోటీసులు రాలేదని చెప్పడంతో ఈ వదంతులకు తెరపడినట్లయింది.

## ప్రధానిగా మోదీకి 12 ఏళ్లు పూర్తి

న్యూఢిల్లీ: భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పదవీ కాలాన్ని పూర్తిచేసుకున్నారు. ఆయన సరిగ్గా 12 సంవత్సరాల క్రితం.. 2014 మే 26వ తేదీన తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మంగళవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మోదీకి బీజేపీ నేతలు అభినందనలు తెలియజేశారు. మోదీ పదవీకాలాన్ని భారతదేశం తిరిగి ఆత్మవిశ్వాసం వైపు పయనించడంగా, సాంస్కృతిక పునరుజ్జీవనంగా అభివర్ణించారు. మోదీ వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ 140 కోట్ల మంది తోటి పౌరులకు సేవ చేయడానికే ప్రతి క్షణాన్ని అంకితం చేశారని, ఈ సంకల్పాన్నే జీవితానికి మార్గదర్శక సూత్రంగా చేసుకున్నారని బీజేపీ పేర్కొంది. మోదీకి అభినందనలు తెలియజేస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు తదితరులు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు.

## నేటినుంచి టిడిపి మహానాడు

ఈ వేదికను సిద్ధం చేశారు. ఈ మహానాడు వేదికగా వచ్చే ఎన్నికలకు చంద్రబాబు రోడ్ మ్యాప్ ప్రకటించనున్నారు. ఈసారి మహానాడు నిర్వహణలో టీడీపీ వినూత్న పంథాను అనుసరిస్తోంది. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీనికి అనుగుణంగా, భారీ జన సమీకరణకు బదులుగా ఇంధనాన్ని ఆదా చేసే లక్ష్యంతో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు భౌతికంగా పాల్గొంటాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 1,800కు పైగా క్లస్టర్ల నుంచి వర్చువల్‌గా పాలుపంచుకుంటారు. ఈ క్లస్టర్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలోనూ పండుగ వాతావరణం ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**20 తీర్మానాలు... 2029కి రోడ్‌మ్యాప్**

రెండు రోజుల మహానాడులో మొత్తం 20 తీర్మానాలపై చర్చించి ఆమోదించనున్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినవి 10, తెలంగాణకు 4, అండమాన్‌కు 1, ఉభయ రాష్ట్రాలకు వర్తించేవి 4 ఉన్నాయి. చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా 2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేసేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను ఈ మహానాడు వేదికగా ఆవిష్కరించనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడం కూడా ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాల్లో ఒకటి. తొలి రోజు ఉదయం 9 గంటలకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మహానాడును ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభోపన్యాసం చేస్తారు. పార్టీ ఆర్థిక వ్యవహారాల నివేదికను సమర్పించిన తర్వాత, చంద్రబాబు కార్యకర్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేస్తారు. 'స్త్రీ శక్తి', 'కార్యకర్తే అధినేత', 'పేదల సేవ' వంటి అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. రెండో రోజు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయి. 'తెలుగుజాతి విశ్వఖ్యాతి', 'అన్నదాతకు అండగా', 'విధ్వంసం నుంచి వికాసం వైపు', 'సంపద సృష్టి' వంటి పలు కీలక అంశాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయి. చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో మహానాడుకు తెరపడుతుంది. ఈ మహానాడులో మరో ప్రత్యేక ఆకర్షణ నారా లోకేష్.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ధాన్యం కొనుగోళ్లలో సర్కారు విఫలం

**– రెండు నెలలైనా కాని తూకాలు.. రైతుల అవస్థలు**

**– భూదాన్ పోచంపల్లిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రహదారిపై ధర్నా**

**– బీఎస్పీ మండల అధ్యక్షుడు మీసాల సైదులు**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఆరుగాలం కష్టపడి పంట పండించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకి తీసుకొస్తే రెండు నెలలైనా తూకం వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ మండల అధ్యక్షుడు మీసాల సైదులు విమర్శించారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని స్థానిక నేతాజీ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో రైతులు, అఖిలపక్ష నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీసాల సైదులు మాట్లాడుతూ.. మండలంలో ధాన్యం కొనుగోలు అధికారులు పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు రైస్ మిల్లర్లు తూకం, తరుగు పేరిట అన్నదాతలను దోపిడీకి గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మండలంలో ఇప్పటివరకు 40 శాతం కూడా కొనుగోళ్లు పూర్తి కాలేదని, అకాల వర్షాలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, మీసాల సుమన్, గోని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**– పరామర్శించిన సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు రంగా నరేష్ గౌడ్**

**– రూ. 5 వేల నగదు అందజేత**



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన వట్టిపల్లి బాలమ్మ (65) అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్, రాజాపేట మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు రంగా నరేష్ గౌడ్ మంగళవారం మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
ఆ కుటుంబానికి తక్షణ సాయంగా రంగా నరేష్ గౌడ్ రూ. 5,000 ఆర్థిక సాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన బాలమ్మ మరణం విచారకరమని, వారి కుటుంబానికి గ్రామం తరపున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని పాండు, బచ్చాల శేఖర్, రఘుపతి, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు

## అయోధ్య పద్మశాలి సత్ర నిర్మాణానికి రూ. 1.50 లక్షల విరాళం

**– జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు ఉదారత**

**– కుల బంధువులు భాగస్వాములు కావాలని తౌర్ర విష్ణు పిలుపు**



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయోధ్యలో పద్మశాలి కులబాంధవుల వసతి నిమిత్తం నిర్మించ తలపెట్టిన సత్ర భవన నిర్మాణానికి యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు రూ. 1,50,000/- భారీ విరాళాన్ని అందజేశారు. మంగళవారం ఆయన ఈ విరాళాన్ని సత్ర నిర్మాణ కమిటీ ప్రతినిధులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు శివ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు తౌర్ర విష్ణు, ప్రధాన కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు చిక్క వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం తౌర్ర విష్ణు మాట్లాడుతూ.. సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి కొలువైన పరమ పవిత్రమైన అయోధ్య క్షేత్రంలో పద్మశాలి సమాజం తరపున సత్ర నిర్మాణానికి 2.05 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిన విషయం కులబాంధవులందరికీ తెలిసిందేనన్నారు. జిల్లా అధ్యక్షుడిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్క పద్మశాలి సోదరుడు తమకు తోచినంత ఆర్థిక సాయం అందించి భవన నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మన వంతు సాయం అందించి ఆ సీతారామచంద్రస్వామి వారి కృపకు పాత్రులం కావాలని ఆయన ఆకాంక్షించారు.

## మహానాడును విజయవంతం చేయాలి






**రేపల్లెలో 'హైబ్రిడ్' వేదికల సన్నాహాలు**

**పొదుపు చర్యల్లో భాగంగానే వినూత్న నిర్ణయం**

**సమీక్షా సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపు**

**తొలివెలుగు, రేపల్లె:**
రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27, 28 తేదీలలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "హైబ్రిడ్ మహానాడు-2026" కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రేపల్లెలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, పొదుపు చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ఈ ఏడాది మహానాడును సరికొత్త పంథాలో 'హైబ్రిడ్' విధానంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భౌతిక, డిజిటల్ రూపాల సమ్మేళనంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే పార్టీ మూల సిద్ధాంతాలను కాపాడుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా రేపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా 10 క్లస్టర్లలో ప్రత్యేక మహానాడు వేదికలను సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు. మండలాల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. **ఏర్పాట్లు పూర్తి:** సామాగ్రి పంపిణీ మహానాడు నిర్వహణకు సంబంధించి నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని పార్టీ శ్రేణులు తెలిపాయి. ఈ నేపథ్యంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జిలు, మండల పార్టీ అధ్యక్షులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, కార్యక్రమ విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. అనంతరం మహానాడుకు అవసరమైన ప్రచార, సాంకేతిక సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని జయలక్ష్మి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధర్, విజయవాడ దుర్గగుడి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ జివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె రత్నానికి 'ఎన్టీఆర్ అవార్డు'!







**ఈ నెల 28న సాతులూరులో పురస్కార ప్రదానం**

**కళారత్న ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం**

**హర్షం వ్యక్తం చేసిన సాహితీ, రంగస్థల ప్రముఖులు**

**తొలివెలుగు, రేపల్లె :**
బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, చరిత్ర పరిశోధకుడు, రంగస్థల బహుముఖ ప్రజ్ఞాశాలి 'కళారత్న' మన్నె శ్రీనివాసరావుకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. ఈ నెల 28న సాతులూరులో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు 'ఎన్టీఆర్ అవార్డు'ను ప్రదానం చేయనున్నారు. 45 ఏళ్లుగా నాటక, సాహిత్య రంగాలకు ఆయన చేసిన నిరంతర సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కడంపై కళాకారులు, అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

**బాల్యం నుంచే కళాతపస్సు:**
1968 జూన్ 4న బాపట్ల జిల్లా చుండూరుపల్లిలో జన్మించిన మన్నె శ్రీనివాసరావు, కేవలం 13 ఏళ్ల ప్రాయంలోనే 'ఎత్తుకు పైఎత్తు' నాటిక ద్వారా నటుడిగా, రచయితగా, దర్శకుడిగా రంగస్థల ప్రవేశం చేశారు. ఇప్పటివరకు 1,700కు పైగా ప్రదర్శనలకు దర్శకత్వం వహించిన ఆయన.. అశోకుడు, బుద్ధుడు, వశిష్ఠుడు, గిరీశం, చాణక్యుడు వంటి విభిన్న పాత్రల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఒడిషాలోని కటక్‌లో జరిగిన 4వ ప్రపంచ నాటకోత్సవాల్లో 'సమ్రాట్ అశోక' నాటికను ప్రదర్శించి, ప్రపంచ వేదికపై నటన, రచన, దర్శకత్వం మూడింటినీ స్వయంగా నిర్వహించిన తొలి తెలుగు కళాకారుడిగా చరిత్ర సృష్టించారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో 18 భాషల నాటక సమాజాలతో పోటీపడి అనేక పురస్కారాలు సాధించారు.

**చరిత్ర పరిశోధనలో మేటి:**
రంగస్థల సేవలతో పాటు చరిత్ర పరిశోధకుడిగా 'రేపల్లె చరిత్ర', 'రేపల్లె రంగస్థలి' వంటి ప్రామాణిక గ్రంథాలను ఆయన అందించారు. 'దివ్యధాత్రి' వంటి పద్యకావ్యాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాటక విజ్ఞాన సర్వస్వంలో 40 పరిశోధనా వ్యాసాలు రాశారు. ప్రస్తుతం ఏడు గ్రంథాల మహా ప్రాజెక్టుగా 'ఎన్టీఆర్ విజ్ఞాన సర్వస్వము' రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఆయన సేవలకు గానూ గతంలో రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం 'కళారత్న (హంస పురస్కారం)-2025'ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. సాహిత్యం, రంగస్థలం, చరిత్ర పరిశోధన రంగాల్లో నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్న మన్నె శ్రీనివాసరావుకు దక్కనున్న ఎన్టీఆర్ అవార్డు ఆయన కళాతపస్సుకు లభించిన సముచిత గౌరవమని ప్రముఖ సంఘసేవకులు వంకాయలపాటి హరిబాబు, ఆడుసుమిల్లి మల్లికార్జునరావు, కాట్రగడ్డ వెంకట సుబ్బారావు, యార్లగడ్డ సత్యనారాయణ, మట్టా రాజా, అమరనేని హరిబాబు, పోలూరు సుబ్బారావు, వల్లెం లక్ష్మీకాంతారావు, చలసాని శ్రీకృష్ణ, పులుగు చిన వీరరాఘవులు, బందా బాబు తదితరులు



పేర్కొన్నారు. పలువురు రంగస్థల అభిమానులు, సాహితీవేత్తలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పురపాలక వైస్ చైర్మన్ తనిఖీ

**– వైద్య సేవలపై రోగులతో ముఖాముఖి**

**– నాణ్యమైన చికిత్స అందించాలని సిబ్బందికి సూచన**

**– మెరుగైన సేవలకు ఎల్లప్పుడూ కృషి: గోశిక వినయ్ కుమార్**

**తొలివెలుగు, చౌటుప్పల్ :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను తనిఖీ చేసి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన, నాణ్యమైన చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు.




ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువయ్యేలా, మెరుగైన సేవలు అందేలా ప్రజాప్రతినిధులుగా ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే



తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



**– రేణిగుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**– హాజరైన సర్పంచ్ కర్రే వెంకటేష్, పంచాయతీ ప్రతినిధులు**

**తొలివెలుగు, రాజాపేట:**
సమాజానికి శాపంగా మారిన బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా భావించాలని రాజాపేట మండలంలోని రేణిగుంట గ్రామ సర్పంచ్ కర్రే వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధంపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహాలు చేయడం వల్ల వారి భవిష్యత్తు నాశనమవ్వడమే కాకుండా, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టప్రకారం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్ల హర్షవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు బర్రె మల్లేశం, సత్య కళ, భబిత, కళ్యాణి, అలాగే ఐసీడీఎస్ సిబ్బంది పాండురంగ స్వామి, రంగయ్య, దేవిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



Telangana

# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..



## మండుటెండల్లో ఉపాధి కూలీల తిప్పలు.. అధికారులపై కార్మిక సంఘం ఫైర్!

- దూది వెంకటాపురం, నమిలే గ్రామాల్లో పనుల తనిఖీ
- రెండు పూటల ఫోటోల విధానాన్ని రద్దు చేయాలి
- వేతనం రూ. 600కు పెంచాలంటూ జూకంటి పౌలు డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:**
మండుటెండల్లో చెమటోడ్చి పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు విమర్శించారు. మంగళవారం రాజాపేట మండలంలోని దూది వెంకటాపురం, నమిలే గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా పని ప్రదేశాలలో కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జూకంటి పౌలు మాట్లాడుతూ.. భానుడి భగభగలకు ఉదయం 8 గంటల నుంచే ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతున్నా, కూలీల సంరక్షణకు చర్యలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పని ప్రదేశాలకు కాలినడకన వెళ్తున్న కూలీలకు అక్కడ కనీసం తాగడానికి నీరు, విశ్రాంతి తీసుకోవడానికి నీడ, అత్యవసర చికిత్సకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచకపోవడం దారుణమన్నారు. కొన్ని చోట్ల ఒకటి లేదా రెండు నీటి క్యాన్లతో సరిపెడుతున్నారని, దీంతో కూలీలు ఇళ్ల నుంచే నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి ఎండ తీవ్రత దృష్ట్యా టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ వేతనాన్ని రూ. 600లకు పెంచాలని కోరారు. అలాగే, రోజుకు రెండు పూటలా ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని, పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి హామీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కట్టా రవి, నీలం బిక్షపతి, పులి బాబు, పరమేష్, కొలనుపాక బాలయ్య, రేష్మ, నీలం రజిత, ఎండీ సమీరా, సయ్యద్ నజీయా, కట్కూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బెల్లి లలిత వర్ధంతి వేడుకలు

**చౌటుప్పల్‌లో నివాళులర్పించిన యాదవ సంఘం నేతలు**

**పాఠ్యపుస్తకాల్లో ఆమె చరిత్రను చేర్చాలి**

**యాదవ జేపీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్**



**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ సామాజిక ఉద్యమకారిణి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అమరురాలు బెల్లి లలిత వర్ధంతి కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులు, సామాజిక కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా యాదవ జేపీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బడుగు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచి పోరాడిన బెల్లి లలితను ఆనాటి పెత్తందారీ శక్తులు కుట్రపూరితంగా హత్య చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ తన ఆట, పాటల ద్వారా ప్రజల్లో విప్లవాత్మక చైతన్యాన్ని నింపిన లలితక్క స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమన్నారు. అమరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిచ్చి ఎమ్మెల్సీ పదవులతో గౌరవించాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బెల్లి లలిత విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, ఆమె జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు పాఠ్యపుస్తకాల్లో ఆమె జీవిత చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు.
అనంతరం యాదవ సంఘం మండల అధ్యక్షుడు చినుకని మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం లలితక్క చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పరవతాలు యాదవ్, నాయకులు రొండే నరసింహ యాదవ్, సర్పంచ్ స్వామి యాదవ్, గజ్జి పాండ యాదవ్, సాయి కుమార్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు, మహిళలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుకు తాళం.. ధాన్యం బస్తా దగ్ధం!



- రాజాపేటలో సింగారం రైతుల తీవ్ర నిరసన
- కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై అన్నదాతల ఆగ్రహం
- పోలీసుల చొరవ, సీఈవో హామీతో నిరసన విరమణ

**తొలివెలుగు, రాజాపేట:**
ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం రాజాపేటలోని ఆలేరు వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్ గోదాము ఎదుట తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటంతో ఆగ్రహించిన అన్నదాతలు గోదాము గేటుకు తాళం వేసి, దాని ఎదుటే బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో నిరసనగా ఒక ధాన్యం బస్తాను రోడ్డుపైనే తగులబెట్టారు. బొంతుగుల ఐకేపీ కేంద్రం వద్ద కూడా రైతులు ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలిపారు.

### 70 లారీలకు.. 15 లారీలే తరలింపు

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కర్ల కరుణాకర్ రెడ్డి మరియు రైతులు మాట్లాడుతూ.. సింగారం గ్రామంలో ఈసారి గతంలో కంటే మూడు రెట్లు ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చిందన్నారు. దాదాపు 70 లారీల ధాన్యం పండగా, ఇప్పటివరకు కేవలం 15 లారీల ధాన్యం మాత్రమే రైస్ మిల్లులకు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా 200 కుప్పల ధాన్యం ఐకేపీ కేంద్రంలోనే ఉండిపోయిందని, నెల రోజులు దాటుతున్నా అధికారులు శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. దీనికి తోడు క్వింటాలుకు 3.5 కిలోల ధాన్యం తూకం ఎక్కువ వేస్తున్నారని, బస్తాకు రూ. 2 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఒకవేళ ధాన్యం తడిస్తే షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.




### అధికారుల హామీ..

రైతులు మార్కెట్ యార్డ్ గేటు ముందు ధాన్యం బస్తాను తగులబెట్టి ఆందోళన తీవ్రం చేయడంతో రాజాపేట ఎస్సై లింగారెడ్డి అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. అనంతరం రేణిగుంట పీఏసీఎస్ సీఈవో సెల్వేరు శేఖర్ అక్కడికి చేరుకుని, ధాన్యం కొనుగోళ్లను తక్షణమే వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ వల్లపు ప్రదీప్ సందర్శించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే, మూడు రోజుల్లోగా లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు.

## పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలి





- రైతుల కోసం రూ. 10.20 లక్షల సొంత నిధులు ప్రకటించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- నియోజకవర్గంలో 9 లక్షల క్వింటాళ్ల సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి ఆదేశం
- రెండు జిల్లాల ఉన్నతాధికారులతో మునుగోడులో సుదీర్ఘ సమీక్ష

**తొలివెలుగు, చౌటుప్పల్/మునుగోడు:**
నియోజకవర్గ వ్యాప్తంగా ఏసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాబోయే పది రోజుల్లోగా పూర్తిగా ముగించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మునుగోడులోని అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. కల్లాల్లో నిల్వలు, హమాలీలు, లారీల కొరత, దిగుబడి-నిల్వ సామర్థ్యాల మధ్య ఉన్న వ్యత్యాసాలపై క్షేత్రస్థాయి అధికారులతో ఆరా తీశారు.

### దిగుబడి పెరిగింది.. కొరత వేధిస్తోంది!

ఈ సమీక్షలో అధికారులు నియోజకవర్గ గణాంకాలను ఎమ్మెల్యే ముందుంచారు. నల్లగొండ జిల్లా పరిధిలోని మునుగోడు, చండూరు, ఘట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ మండలాల్లో గత ఏడాది 2,85,560 క్వింటాళ్ల ధాన్యం సేకరించగా, ఈసారి రికార్డు స్థాయిలో 4,20,430 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇందులో 3,52,300 క్వింటాళ్ల సేకరణ పూర్తి కాగా, ఇంకా కల్లాలలో 68,130 క్వింటాళ్ల ధాన్యం ఉండిపోయింది. యాదాద్రి జిల్లా పరిధిలోని చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లోనూ గత ఏడాది కంటే రెండింతలు ఎక్కువ దిగుబడి వచ్చిందని, ఇప్పటివరకు 2,36,215 క్వింటాళ్లు సేకరించామని అధికారులు వివరించారు. అయితే హమాలీలు, లారీల కొరతతో పాటు కొన్ని రైస్ మిల్లులు బ్లాక్‌లిస్టులో ఉండడం, నిల్వ సామర్థ్యం గల గోదాములు లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని అధికారులు నివేదించారు.

### సొంత నిధులతో హమాలీలకు అదనపు కూలీ

ధాన్యం తరలింపులో హమాలీల కొరతను అధిగమించడానికి, రైతులకు తక్షణ ఉపశమనం కలిగించడానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఒక వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే కూలీకి అదనంగా తానే స్వయంగా రూ. 10,20,000 సొంత నిధులను హమాలీలకు చెల్లిస్తానని అధికారులకు హామీ ఇచ్చారు.

### శాశ్వత పరిష్కారంగా 9 లక్షల క్వింటాళ్ల గోదాములు

భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గంలో మండలం యూనిట్‌గా పంట దిగుబడులను ముందే అంచనా వేయాలన్నారు. శాశ్వత పరిష్కారంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 9 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వ చేసేలా గోదాముల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

**ఇందులో భాగంగా:**

**చౌటుప్పల్ : 4 లక్షల క్వింటాళ్లు**
**మునుగోడు : 2 లక్షల క్వింటాళ్లు**
**నారాయణపూర్ : 2 లక్షల క్వింటాళ్లు**

నాంపల్లి: 1 లక్ష క్వింటాళ్ల సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.
ఈ సమావేశంలో నల్లగొండ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, చౌటుప్పల్ ఆర్డీవో వి. శేఖర్ రెడ్డి, యాదాద్రి, నల్లగొండ జిల్లాల డీసీఓలు, పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వేసవి వేడిలో మజ్జిగతో ప్రజలకు ఉపశమనం

- వారసంతకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు పీసీఆర్ ఫౌండేషన్ చొరవ
- ఎనిమిదో వారానికి చేరిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం
- ప్రతి మంగళవారం ప్రజలకు చల్లని ఉపశమనం
- వేసవి ముగిసే వరకు సేవలు కొనసాగింపు: ముడుగు ప్రవీణ్ కుమార్

**తొలివెలుగు, జన్నారం:** మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు వచ్చే ప్రజలు, నిరుపేద కూలీల దాహార్తిని తీర్చేందుకు పీసీఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని వారాలుగా సాగుతున్న ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం మంగళవారంతో విజయవంతంగా ఎనిమిదో వారానికి చేరుకుంది. ఎండల తీవ్రత దృష్ట్యా సంతకు వచ్చే గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఈ వినూత్న సేవలను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పల్లెల నుంచి సంతకు వచ్చే ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ఈ చల్లటి మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం పూర్తిగా ముగిసేవరకు ప్రతి మంగళవారం వారసంతలో ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా సాగుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరి నరసయ్య, ప్రముఖులు గోపి సత్యనారాయణ, నోముల రాజకుమార్, దేవయ్య, చకినాల భూమేష్, రాజేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొని ప్రజలకు మజ్జిగ గ్లాసులను అందజేశారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# బాలాజీ హాస్పిటల్‌లో నకిలీ డాక్టర్ బాగోతం!






**- ల్యాబ్ టెక్నీషియనే 'డాక్టర్' గా అవతారం**
**- పత్రికా కథనాలతో కదిలిన యంత్రాంగం**
**- భువనగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ కళ్యాణ్ తనిఖీలు**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:**
స్థానిక బాలాజీ ఆసుపత్రిలో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళ ఏకంగా డాక్టర్ అవతారమెత్తి రోగులకు వైద్యం చేస్తున్న వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఈ అంశంపై పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భువనగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ కళ్యాణ్ మంగళవారం బాలాజీ ఆసుపత్రిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

**అర్హతలేని సిబ్బందితో వైద్య సేవలు**

తనిఖీల్లో భాగంగా ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పత్రాలు, రోగుల రికార్డులు, వైద్య సేవల నిర్వహణపై అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ఈనెల 22న చికిత్స కోసం వచ్చిన ఓ రోగికి ఆసుపత్రిలో అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అనిత అనే మహిళే స్వయంగా డాక్టర్‌గా వ్యవహరిస్తూ చికిత్స అందించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.
అంతేకాకుండా ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో మందులు పంపిణీ చేస్తున్న ఇద్దరు యువతులకు కూడా అవసరమైన అర్హతలు లేవని డిప్యూటీ డీఎంహెచ్‌వో గుర్తించినట్లు తెలిపారు.

**అధికారుల నిలదీతకు పొంతనలేని సమాధానాలు**

తనిఖీల సందర్భంగా డాక్టర్ సుమన్ కళ్యాణ్ సదరు మహిళను ప్రశ్నిస్తూ, "ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ రోగులకు వైద్యం ఎలా చేస్తారు?" అని నిలదీశారు. దీనికి ఆమె స్పష్టతలేని సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే ఆసుపత్రి తన పేరిట లేదని, డాక్టర్ జయవర్ధన్ పేరిట నడుస్తోందని ఆమె వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అధికారులు డాక్టర్ జయవర్ధన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. రోగులకు జారీ చేస్తున్న ప్రిస్క్రిప్షన్‌లపై వైద్యుడి పేరు, రిజిస్ట్రేషన్ వివరాలు, మొబైల్ నంబర్ వంటి కీలక సమాచారం లేకపోవడాన్ని అధికారులు తీవ్రంగా తప్పుపట్టారు.

**ఉన్నతాధికారులకు నివేదిక**

నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్ టెక్నీషియన్ నేరుగా వైద్యం చేయడం చట్టరీత్యా తీవ్రమైన ఉల్లంఘన అని డిప్యూటీ డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో గుర్తించిన లోపాలు, అక్రమాలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి చర్యలు తీసుకునేలా ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.
ఈ తనిఖీల్లో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# తుర్క కాశ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి




**- 100 మంది లబ్ధిదారులకు కట్టర్ల పంపిణీ**
**- హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, 'సియాసత్ హబ్' చైర్మన్ అమీర్ అలీ ఖాన్**
**- చౌటుప్పల్‌లో తెలంగాణ తుర్క కాశ సంక్షేమ సంఘం సమావేశం**

**తొలివెలుగు, చౌటుప్పల్:**
రాష్ట్రంలోని తుర్క కాశ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) నెల్లికంటి సత్యం కోరారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని పీబీ గార్డెన్‌లో తెలంగాణ తుర్క కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడే సాబ్ అధ్యక్షతన మంగళవారం ఒక ప్రత్యేక సమావేశం జరిగింది. గత శాసనమండలి సమావేశాల్లో తుర్క కాశ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి ప్రయోజనాల కోసం చొరవ చూపినందుకు కృతజ్ఞతగా ఈ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను ఘనంగా సన్మానించారు.
అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన రాళ్లు కట్ చేసే అధునాతన కట్టర్లను 100 మంది వృత్తి కార్మికులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సియాసత్ హబ్ ఫౌండేషన్ చైర్మన్ అమీర్ అలీ ఖాన్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కష్టజీవులైన తుర్క కాశ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, సభలో తాను లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించినందుకు సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను అందించడం వల్ల కార్మికుల శ్రమ తగ్గుతుందని, ఉపాధి మెరుగవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు చెందిన తుర్క కాశ కార్మికులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికల భవిష్యత్తును చీకటిలోకి నెట్టొద్దు





**- జలాల్‌పూర్‌లో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు**
**- బాల్యవివాహానికి తోడ్పడినా నేరమే.. అందరికీ శిక్ష తప్పదు**
**- బాలికల ఆరోగ్య పరిరక్షణకు 'స్నేహ' సమ్మర్ క్యాంప్**
**- అనీమియా నివారణకు పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన**
**- చిన్న వయసులో పెళ్లి.. జీవితాంతం ఇబ్బందులే అని హెచ్చరిక**
**- చట్టానికి విరుద్ధంగా వివాహాలు జరిపితే కఠిన చర్యలు ఖాయం... సర్పంచ్ శాపాక లింగస్వామి**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:**
సమాజానికి శాపంగా మారిన బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, 18 సంవత్సరాల లోపు పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా కఠినమైన నేరమని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ స్పష్టం చేశారు. జలాల్‌పూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో మంగళవారం "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రామ పరిధిలోని తల్లిదండ్రులు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల బాలికల భవిష్యత్తు అంధకారమవడమే కాకుండా, వారి శారీరక, మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతుందని తెలిసినా అధికారులకు సమాచారం అందించాలే తప్ప, ఆ వివాహాన్ని ప్రోత్సహించడం కానీ, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయం చేయడం కానీ చేయకూడదని హెచ్చరించారు. ఒకవేళ చట్టాన్ని ఉల్లంఘిస్తే.. వివాహం జరిపించే పురోహితుడికి, పెళ్ళికొడుకుకి, వారి తల్లిదండ్రులకు, అలాగే వారికి తోడుగా నిలిచే బంధువులకు కూడా ఈ శిక్ష వర్తిస్తుందని తల్లిదండ్రులకు, కిశోర బాలికలకు క్షుణ్ణంగా వివరించారు.

**రక్తహీనతపై అవగాహన..**

ఇదే వేదికపై కిశోర బాలికల ఆరోగ్యం కోసం నిర్వహించిన "స్నేహ సమ్మర్ క్యాంప్"లో నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎం, సీసీ మల్లేశం, వీబీకే రజితలు బాలికల్లో రక్తహీనత (అనీమియా) నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శరీరంలో హిమోగ్లోబిన్ శాతం ప్రాముఖ్యత, నిత్య జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి పిల్లలకు సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కేసారం మధుసూధన్ రెడ్డి, వార్డు సభ్యులు సీహెచ్. మంగ, ఎస్. పద్మ, వీఓ కృష్ణవేణి, సంధ్య, అమృత, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, కిశోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుడిబండ గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

## గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య



**కోదాడ మే 26 (క్రైమ్ మిర్రర్) కోదాడ :**
మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడం, బాలికల భవిష్యత్తును రక్షించడం మరియు వారి విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు జరగకుండా అధికారులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి ఆడపిల్ల తన చదువును పూర్తిచేసుకుని స్వయం స్థిరత సాధించే వరకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అలాగే గ్రామంలోని యువతులు మరియు 18 సంవత్సరాల లోపు బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా బాల్య వివాహాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తే వెంటనే గ్రామ పంచాయతీకి లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అంగన్వాడీ సూపర్వైజర్ సంధ్య మేడం పాల్గొని బాలికల హక్కులు, విద్య ప్రాముఖ్యత మరియు బాల్య వివాహాల నిరోధక చట్టాలపై వివరించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, 18 సంవత్సరాల విద్యార్థినులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాపుగల్లు గ్రామం కాలనీలో అగ్ని ప్రమాదం...



**తొలివెలుగు, కోదాడ :** కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో కొంతమంది వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు రైతు వేదిక సమీపంలో నీ కాలనీలో నీ గుడిసెలకు అంటుకుని కొన్ని ఇండ్లు , ప్రకృతి వనం కొంతమేర కాలిపోయినాయి .. ఫైర్ ఇంజన్ ఫైర్ సిబ్బంది లేకపోవడంతో కాలనీవాసులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు వేలది పద్మావతి కాలనీ వాసులకు సహాయ సహకారాలు అందించి మాట్లాడారు. 10 ఇండ్లు దగ్ధం అయినాయి అని తెలిపారు. ప్రభుత్వం కాలనీ వాసులకు పక్కాభవనాలు కట్టించి ఇవ్వాలని ఆమె కోరారు. కాలనీవాసులు మంటలను గమనించకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని ఆమె తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించి పక్క ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జనగణన చేస్తున్న ప్రభుత్వ టీచర్ పై దాడి చేసి, బూతులు తిట్టిన ఇంటి యజమాని

**ఇంటి యజమానిపై కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు**

**తొలివెలుగు, ఎల్బీనగర్:** నిన్న మంగళవారం రోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కోరే మల్లయ్య తండ్రి కట్టయ్య, వయస్సు:42 సంవత్సరాలు, గవర్నమెంట్ టీచర్ అనే అతను జన గణన లో భాగంగా ఆదిభట్ల సర్కిల్ -15 లోని కమ్మగూడా లోని హనుమాన్ నగర్ కాలనీ లో ఉదయం 7:30 గంటల సమయంలో జన గణన కోసం వెళ్లగా అట్టి ఇంటి యజమాని తన పై దాడి చేసి బూతు మాటలు తిట్టి విధులకు ఆటంక పరిచినారు అని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, వనస్థలిపురం ఇన్స్పెక్టర్ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ఇంటి యజమా ని ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

# మృతుడు ఎరుకల బుచ్చయ్య గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**అందచేసిన భాషబోయిన ఉప్పలయ్య యాదవ్, బచ్చు రాధకిషన్ గుప్తా**

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ల గ్రామంలో మంగళవారం రోజు అనారోగ్యంతో మృతి చెందిన ఎరుకల బుచ్చయ్య కుటుంబాన్ని పరామర్శిస్తూ వారి కుటుంబానికి మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య మరియు బిఆర్ఎస్ మండల నాయకులు బచ్చు రాధా కిషన్ గుప్తా(5000o5000=10000) పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డశీ ముత్తమ్మ,ఉప సర్పంచ్ హనుమంతుల రమేష్,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్,జనరల్ సెక్రెటరీ గడ్డం అశోక్,వార్డ్ మెంబర్లు కోరకొప్పుల మహేష్,వడ్లకొండ ధనలక్ష్మి,నరసింహ,మాజీ సర్పంచ్ ఉప్పల నరసింహ, నాయకులు మోతే యాదగిరి రెడ్డి,దొంతర బోయిన వెంకటయ్య,సుదగాని మల్లేష్ గౌడ్,బూరుగు భాష గౌడ్, నార్కట్పల్లి మచ్చగిరి,ఉప్పల నవీన్,ఎరుకల సోమయ్య, ఎరుకల రవి,ఎరుకల పాపయ్య, తుక్కాపూర్ ఉపసర్పంచ్ ఎరుకల బాల నరసయ్య,బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిన మత్యగిరి,ఎరుకల లక్ష్మీనరసు, ఎరుకల రాజు,తదితరులు పాల్గొన్నారు.

